ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 3 ఫిబ్రవరి 2026 www.prajaswaramdailly.com 3 PM

# హెచ్సీఏ నూతన అధ్యక్షుడిగా అమర్‌నాథ్

**హైదరాబాద్, ప్రజాస్వరం**




హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా అమర్‌నాథ్ నియమితులయ్యారు. ఆ మేరకు రిటైర్ చీఫ్ జస్టిస్, ప్రస్తుత అంబుడ్స్‌మన్ సురేష్ కుమార్ కైత్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో జరిగిన ఎన్నికల్లో జగన్మోహన్ రావు చేతిలో కేవలం ఒక్క ఓటుతో అమర్‌నాథ్ ఓడిపోయారు. జగన్మోహన్‌రావు అరెస్ట్ తర్వాత హెచ్సీఏ పదవి తొమ్మిది నెలలుగా ఖాళీగా ఉంది. దీంతో అమర్‌నాథ్ తనను హెచ్సీఏ అధ్యక్షుడిగా నియమించాలని అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించడంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ వల్లే సింగరేణి భ్రష్టు పట్టింది

**నాడు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారు..**

**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుంది**

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



హైదరాబాద్, ప్రజాస్వరం
బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని, సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహద పడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్–2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్‌లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.

ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు.



# మంటల్లో బైక్ దగ్ధం

దుర్గంచెరువు, ప్రజాస్వరం
మంటల్లో బైక్ దగ్ధమైంది. హైదరాబాద్–దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై అకస్మాత్తుగా బైక్ లో మంటలు వచ్చాయి. బైక్ ను కేబుల్ బ్రిడ్జిపైనే పక్కకు వాహనదారులు ఆపాడు. నిమిషాల్లోనే బైక్ పూర్తిస్థాయిలో దగ్ధమైంది.

# కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై విచారణ రేపు



హైదరాబాద్ , ప్రజాస్వరం
ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్ పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు విచారణ జరగనుంది. పిటిషనర్ కేపీ వివేకానందగౌడ్ వాదనలు స్పీకర్ నమోదు చేయనున్నారు.



# కానిస్టేబుల్ రవిప్రసాద్ సస్పెండ్

మంచిర్యాల, ప్రజాస్వరం
మద్యం మత్తులో అరనగ్నంగా భార్యను రోడ్డుపై చితకబాదిన కానిస్టేబుల్ రవిప్రసాద్ సస్పెండ్ అయ్యాడు. రవిప్రసాద్ పై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మంచిర్యాలలో మద్యం మత్తులో కానిస్టేబుల్ అనుమానంతో భార్యను రోడ్డుపై చితక బాదాడు. పోలీస్ స్టేషన్లో భార్య శిరీష ఫిర్యాదు చేసింది.

# సూసైడ్ ఎలా చేసుకోవాలని ల్యాప్‌టాప్‌లో సెర్చ్

**హుస్సేన్‌సాగర్‌లో దూకి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య**




హైదరాబాద్,ప్రజాస్వరం
పెళ్లి చేసుకుంటే అమ్మ ఒంటరి అవుతుందని... యువతి ఆత్మహత్యకు పాల్పడింది. హుస్సేన్‌సాగర్‌లో దూకి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నది. నెలకు లక్ష రూపాయల జీతం అయినా తీరని వేదనతో బలవన్మరణం చెందింది. సూసైడ్ ఎలా చేసుకోవాలని ల్యాప్‌టాప్‌లో సెర్చ్ చేసింది. గత నెల 31న ర్యాపిడో బైక్ మీద విజయలక్ష్మి ట్యాంక్‌బండ్‌కు వెళ్లింది. సాగర్‌లో లభ్యమైన మృతదేహాన్ని విజయలక్ష్మిగా పోలీసులు గుర్తించారు.

# ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి 30.. తన వర్గానికి 20టికెట్లు

**మున్సిపల్ ఎన్నికలు.. టికెట్ల కేటాయింపుపై**

**మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అసంతృప్తి**



జగిత్యాల, ప్రజాస్వరం
మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో భాగంగా ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి ఎక్కువ టికెట్లు ఇచ్చారని , ఆయన వర్గానికి 30, తన వరానికి 20 టికెట్లు ఇవ్వడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ చర్యతో తన మెడ కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నేతలు పెద్ద సంఖ్యలో జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకుంటున్నారు.

# మహిళ హత్య

**దుండిగల్ పరిధిలో ఘటన**

దుండిగల్, ప్రజాస్వరం
హైదరాబాద్–దుండిగల్ పరిధిలో మహిళ హత్యకు గురైంది. సుశీలమ్మ అనే మహిళను దారుణంగా హత్య చేసి దుండగులు పారిపోయారు. అనుమానితులకు సంబంధించిన సీసీ ఫుటేజ్ వెలుగులోకి వచ్చింది. ఇంట్లోని సోఫాలో రక్తపు మడుగులో సుశీలమ్మ మృతదేహం కనిపించింది. తలపై బలమైన గాయం.. హత్యగా పోలీసులు ధృవీకరించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ద్వారా కీలక ఆధారాలు సేకరించాయి. దొంగల పనా?.. లేక తెలిసినవారే డబ్బు, నగల కోసం హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.



# మెగాస్టార్ చిరంజీవిని కలిసిన మంత్రి కొండా సురేఖ

**జూబ్లీహిల్స్, ప్రజాస్వరం**
మంత్రి కొండా సురేఖ మంగళవారం మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. తన కూతురు సుస్మితతో కలిసి కొండా సురేఖ జూబ్లీహిల్స్ లోని చిరు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా చిరంజీవికి ఇష్టదైవమైన ఆంజనేయస్వామి చిత్రపటాన్ని కొండా సురేఖ అందజేశారు. అనంతరం ఆయనతో వారు భేటీ అయ్యారు. దీనికి సంబంధించిన ఫోటోలను మంత్రి తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. అంతే కాకుండా తన పోస్ట్ లో చిరంజీవిని మాజీ కేంద్రమంత్రి అంటూ కొండా సురేఖ సంభోదించారు. రీసెంట్ గా చిరంజీవి కుమారుడు రామ్ చరణ్, ఉపాసన దంపతులు కవలలకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్లారని కొంతమంది కామెంట్ చేస్తున్నారు. మరోవైపు సుస్మిత చిరంజీవి అభిమాని అని అందుకే ఆయనను కలిసేందుకు వెళ్లారని కొంతమంది అభిప్రాయపడుతున్నారు.

